పింఛన్లలో విచిత్రాలు..!

- ఆత్మకూరులో అడ్డగోలుగా బోగస్ పింఛన్లు
- భర్త ఉండగానే వితంతు పింఛన్ పొందిన వైసీపీ కౌన్సిలర్
- అర్హత లేకున్నా ఒంటరి మహిళ, డప్పు, చర్మ కళాకారుల పింఛన్లు


అమలాపురం గ్రామంలో బోగస్ పింఛన్లను తొలగించాలని ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు, జూలై 2: గత వైసీపీ ప్రభుత్వ అక్రమాలు ఇంకా చెరిగిపోలేదు. దీనికి సోమవారం పింఛన్ పంపిణీలోని విచిత్రాలే నిదర్శనం. అనర్హులైన తమ పార్టీ వారికి ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, డప్పు, చర్మ కళాకారులకు అందాల్సిన పింఛన్లను ఐదేళ్ల పాటు మంజూరు చేయించుకున్నారు. ఈ సంగతి వైసీపీ ప్రభుత్వం మారిపోవడంతో ఒక్కో అక్రమం వెలుగు చూస్తున్నాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వైసీపీ ప్రభుత్వ హయాంలోని అక్రమాలు బట్టబయలయ్యాయి.

ఆత్మకూరు పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని అర్బన్‌కాలనీలో సోమవారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో బోగస్ పింఛన్లను టీడీపీ శ్రేణులు గుర్తించారు. ప్రత్యేకించి 21వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు బోయ రాముడు భార్య లక్ష్మమ్మ వైసీపీ కౌన్సిలర్‌గా ఉన్నారు. జూన్ 21వ తేదిన రాముడు అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే అంతకుముందు ఆయన వృద్ధాప్య పింఛన్ (ఐడీ నెం: 13952274) తీసుకొనేవాడు. ఆయన భార్య బోయ లక్ష్మమ్మ(ఐడీ నెం: 113833627) వితంతు పింఛన్ తీసుకొనేది. బోయ రాముడు సోదరి రాజేశ్వరి (ఐడీనెం: 113947625) కుటుంబసభ్యులతో కలిసి ఉన్నప్పటికీ ఒంటరి మహిళ పేరుతో పింఛన్ పొందుతున్నది. రాముడు తన బంధువులనే వలంటీర్‌గా నియమించుకోవడంతో వారి అక్రమాలకు వత్తాసు పలికినట్లు తెలిసింది. ఒక్క అర్బన్‌కాలనీలోనే ఈవిధమైన బోగస్ పింఛన్లు కుప్పలుతెప్పలుగా ఉంటే పట్టణమంతా ఎన్ని ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

బోగస్ పింఛన్లపై విచారణ చేస్తాం



ఆత్మకూరు పట్టణంలో మంజూరైన బోగస్ పింఛన్లపై విచారణ చేసి తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ప్రత్యేకించి భర్త బతికి ఉన్నప్పటికీ వితంతు పింఛన్లు, కుటుంబంతో కలిసి ఉన్నప్పటికీ ఒంటరి మహిళ పింఛన్లు, ఇంకా తదితర బోగస్ పింఛన్లను గుర్తించి ఏరివేస్తాం. ఇవి మంజూరు కావడానికి కారణమైన ఉద్యోగుల మీద చర్యలకు సిఫారసు చేస్తాం.

- హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

అమలాపురం గ్రామంలోనూ బోగస్ పింఛన్లు

ఆత్మకూరు మండలంలోని అమలాపురం గ్రామంలో కూడా విచ్చలవిడిగా బోగస్ పింఛన్లను మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నెల 24వ తేది ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మీ కోసం ప్రజాసమస్య పరిష్కారం వేదిక కార్యక్రమంలో బోగస్ పింఛన్లపై గ్రామస్థులు ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేశారు. డప్పు, చర్మ కళాకారులు కానప్పటికీ డప్పు, చర్మ కళాకారుల పింఛన్లను మంజూరు చేశారని అధికారుల దృష్టికి తెచ్చారు. అదేవిధంగా భార్యాభర్తలు కలిసి ఒకే కుటుంబంలో ఉన్నప్పటికీ భారాభర్తలు వేర్వేరు రేషన్ కార్డులను సృష్టించుకుని భర్త వృద్ధాప్య పింఛన్, భార్య వితంతు పింఛన్ పొందుతున్నారని తెలిపారు. అమలాపురం గ్రామంలో ఇలాంటి పింఛన్లు చాలా ఉన్నాయని వారు చెబుతున్నారు.

తెలిసే మంజూరు చేశారా..?

ఆత్మకూరు ప్రాంతంలో ఇలాంటి బోగస్ పింఛన్లు మంజూరు కావడంతో అధికారుల హస్తం ఉందన్న విమర్శలు ఉన్నాయి. కనీసం వితంతు పింఛన్ ఇవ్వాలంటే తప్పనిసరిగా భర్త మరణ ధృవీకరణ పత్రం ఉండాలి. ఏకంగా ఒక కౌన్సిలర్‌కు అనర్హత ఉన్నా వితంతు పింఛన్ పొందుతున్నారంటే ఈ విషయం అధికారులకు తెలియదంటే ఎవరూ నమ్మలేరు. అన్ని తెలిసే సంబంధిత అధికారులు ఈ అక్రమాలకు ప్రోత్సహించినట్లు తెలుస్తోంది. వలంటరీలకు తమ పరిధిలోని 50ఇళ్లలో ఇంతలా బోగస్ పింఛన్లు ఉన్నప్పటికీ వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు.

టిడ్కో ఇల్లు దక్కేనా...?


డోన్ హైవే పక్కన నిర్మించిన టిడ్కో ఇళ్లు

- అర్హుల జాబితాలో మార్పులు చేసిన గత ప్రభుత్వం
- హైకోర్టులో స్టే తెచ్చిన టీడీపీ నాయకులు
- ఇప్పుడైనా నిజమైన లబ్ధిదారులకు అందేనా..?

డోన్, జూలై 2:
టిడ్కో ఇళ్లు ఎప్పుడు ఇస్తారా అని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. డోన్‌లో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన టిడ్కో ఇళ్లపై గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. నిజమైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా వారి ఆశలపై నీళ్లు చల్లింది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో డోన్ పట్టణంలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందేనా అన్న చర్చ సాగుతోంది. 2018 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో డోన్ మున్సిపాలిటీకి 306 టిడ్కో ఇళ్లు మంజూరయ్యాయి. అప్పట్లోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఒక్కో లబ్ధిదారుడితో రూ.500 డీడీ తీసి మున్సిపాలిటీకి అందించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు 60 శాతం పైనే పూర్తయ్యాయి. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వకుండా దక్కకుండా చేశారు.

లబ్ధిదారుల జాబితాను మార్చేసిన వైసీపీ నాయకులు

గత వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లపై నీలి నీడలు కమ్ముకున్నాయి. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అప్పట్లో కొందరు వైసీపీ నాయకులు అక్రమాలకు తెరలేపారన్న విమర్శలు ఉన్నాయి. ఏకంగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల జాబితానే మార్చేసినట్లు ఆరోపణలు వినిపించాయి. కొందరు వైసీపీ నాయకులు తమ ఇష్టారీతిన జాబితాలో అనర్హుల పేర్లను చేర్చి టిడ్కో ఇళ్లను కేటాయించినట్లు విమర్శలు ఉన్నాయి. టిడ్కో ఇళ్ల జాబితాలో అవకతవకలు జరిగాయని టీడీపీ నాయకులు న్యాయ పోరాటం చేశారు.

● ఇప్పటికైనా..

డోన్ పట్టణ సమీపంలోని హైవే పక్కన టైలర్స్ కాలనీలో నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇప్పుడైనా నిజమైన లబ్ధిదారులకు దక్కేనా..? అన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో టిడ్కో ఇళ్లపై లబ్ధిదారులు ఎన్నో ఆశలు పెంచుకున్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించేలా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దృష్టి పెట్టాల్సి ఉంది. ఇప్పటికే టిడ్కో ఇళ్లను నిర్మించి ఐదేళ్లు పూర్తయింది. లబ్ధిదారులకు ఇవ్వకపోతే శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉంది. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చొరవ తీసుకుని.. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించి సొంతింటి కల నిజం చేయాలని కోరుతున్నారు.



టిడ్కో ఇళ్లు

● టీడీపీ నాయకులపై అక్రమ కేసులు:

డోన్ మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో ఇళ్ల జాబితాలో పాత లబ్ధిదారుల పేర్లు తొలగించడంపై టీడీపీ నేత, టైలర్స్ అసోసియేషన్ నాయకులు గోవిందరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పాత జాబితా ప్రకారమే లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలని హైకోర్టులో స్టే తెచ్చారు. దీంతో టిడ్కో ఇళ్లు దక్కించుకోవాలనుకున్న వైసీపీ నాయకుల ఎత్తుగడకు బ్రేక్ పడింది. ఎన్నికలకు ఆరు నెలల ముందు టిడ్కో ఇళ్లపై న్యాయ పోరాటం చేస్తున్న టీడీపీ నేత గోవిందరెడ్డిని వైసీపీ నాయకులు టార్గెట్ చేశారు. హైకోర్టులో వేసిన పిటిషన్ ఉపసంహరించుకోవాలని టీడీపీ నేత గోవిందరెడ్డిపై పోలీసుల ద్వారా తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చారు. అందుకు ఒప్పుకోకపోవడంతో టీడీపీ నేత గోవిందరెడ్డిపై ఎనిమిది నెలల క్రితం అక్రమంగా ఆరు కేసులను నమోదు చేసి అరెస్టు చేశారు. టీడీపీ న్యాయ పోరాటంతో వైసీపీ నాయకుల వ్యూహాలు బెడిసికొట్టాయి.

ఆలస్యమవుతున్న పంట రుణాలు

దిక్కుతోచని స్థితిలో రైతులు



కర్నూలు(అగ్రికల్చర్), జూలై 2: ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో 5 లక్షల మంది రైతులు పంటల సాగు కోసం వివిధ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం పంట రుణాలను అందించే కార్యక్రమం చేపడుతోంది. అయితే వివిధ కారణాల వల్ల ఈసారి పంట రుణాల మంజూరు ఆలస్యం అవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాటు ఎక్కువ మొత్తంలో పంట రుణాలను అందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, సహకార బ్యాంకులకు సంబంధించి పాలకమండళ్లు రద్దయిపోయాయి. మళ్లీ కొత్త పాలక వర్గాలను నియమించాకనే పంట రుణాలపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ జూన్ నెల నుంచే ప్రారంభమైంది. ఈపాటికి చాలా బ్యాంకుల్లో పంట రుణాల మంజూరు చురుగ్గా కొనసాగాల్సి ఉన్నా ప్రస్తుతం ప్రధాన బ్యాంకుల్లో ఏ ఒక్క బ్యాంకు ద్వారా రుణాలు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంవత్సరం పంట రుణాల మంజూరు సంబంధించి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల అధికారులు నాలుగు నెలల క్రితమే సమావేశమై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితాను ఖరారు చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్ కమిటీ ఆమోదానికి పంపారు. అక్కడి నుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా వివిధ మార్పుల తర్వాత ఎన్నికలకు ముందే జిల్లా కేంద్రానికి చేరింది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ఈ జాబితాపై నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. ఇప్పటికైనా త్వరితగతిన కలెక్టర్ బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



డీఎస్సీ నోటిఫికేషన్‌కు పచ్చజెండా



- ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదల
- 4 నుంచి 17 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 25న హాల్ టికెట్ల డౌన్‌లోడ్
- ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు టెట్ పరీక్షలు
- 30న తుది ఫలితాలు విడుదల

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 2: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌కు పచ్చజెండా ఊపింది. ఎన్డీయే కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకం చేయడంతోపాటు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నోటిఫికేషన్ షెడ్యూల్ జారీ చేశారు. దీంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురించాయి. టెట్ షెడ్యూల్ విడుదల కావడంతో నిరుద్యోగుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. రాష్ట్రంలోనే ఏ జిల్లాలో లేని విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2645 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. వచ్చే జనవరిలో జిల్లాలో పదవీ విరమణ పొందిన ఖాళీలను కలుపుకుని ఈ డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,645 పోస్టులు ఖాళీలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2645 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలకు డీఎస్సీ నోటిఫికేసన్ ఇవ్వనుంది. ఇందులో ఎస్‌జీటీ పోస్టులు 1731 వరకు ఖాళీలు ఉన్నాయి. మిగతా స్కూల్ అసిస్టెంట్ ఫస్ట్ లాంగ్వేజ్, సెకండ్ లాంగ్వేజ్, ఎస్ఏ ఇంగ్లీషు, ఎస్ఏ గణితం, ఎస్ఏ ఫిజికల్ సైన్స్, ఎస్ఏ బయోలాజికల్ సైన్స్, ఎస్ఏ సోషల్ స్టడీస్, ఎస్ఏ పీఈటీ పోస్టుల ఖాళీలు ఉన్నాయి.

టెట్ ప్రక్రియ ప్రారంభం

జూలై 3 నుంచి 16వ తేదీ వరకు టెట్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఇచ్చారు. ఈ నెల 4వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. జూలై 17వ తేదీ నుంచి టెట్ దరఖాస్తు చేసుకున్న వారికి మాక్ టెస్టును ఆన్‌లైన్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతారు. జూలై 25వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు టెట్ పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-1ఏ, 1బీ, పేపర్-2ఏ అండ్ 2బీ ప్రశ్నపత్రం ఉంటుంది. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష నిర్వహిస్తారు. 25వ తేదీ ఫైనల్ కీ వెలువడుతుంది. ఆగస్టు 30వ తేదీన తుది ఫలితాలు విడుదలవుతాయి. వీలైనంత త్వరగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసి ఈ ఏడాది డిసెంబరు నాటికి ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

నంద్యాల కలెక్టర్‌గా బి.రాజకుమారి

గుంటూరు జేసీగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ



నంద్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టర్‌గా బి. రాజకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టరుగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాజకుమారిని, రాష్ట్ర ప్రభుత్వం కలెక్టరుగా పదోన్నతి కల్పిస్తూ నంద్యాలకు బదిలీ చేసింది. రాజకుమారి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం కొల్లివలస గ్రామం. 2007లో గ్రూప్ - 1 అధికారిగా ఎంపికయ్యారు. మొదట విజయనగరం సహకార రిజిస్ట్రార్‌గా ఎంపికైన ఆమె, మరో ప్రయత్నంలో 2009 గ్రూప్ - 1లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ఆ తర్వాత విజయనగరం ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. 2013లో సింహాచలం దేవస్థానం భూ సేకరణ స్పెషల్ కలెక్టరుగా విధులు నిర్వహించారు. 2014లో విజయనగరం జడ్పీ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. 2017లో తూర్పు గోదావరి జిల్లా డ్వామా పీడీగా, 2019లో కాకినాడ ఆర్డీవోగా కొన్నాళ్లు పని చేశారు. ఆ తర్వాత అక్కడే జాయింట్ కలెక్టర్ (వెల్ఫేర్)గా విధులు నిర్వహించారు. ఆ తర్వాత తూర్పు గోదావరిలో సచివాలయ జేసీగా, 2021లో గుంటూరు వార్డు, సెక్రటరియేట్ జాయింట్ కలెక్టరుగా బాధ్యతలు చేపట్టారు. 2022లో జిల్లాల విభజన తర్వాత నుంచి ఇప్పటి వరకు గుంటూరు జాయింట్ కలెక్టరుగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కలెక్టరుగా నంద్యాల రానున్నారు. ఇక ప్రస్తుతం నంద్యాల కలెక్టరుగా పని చేస్తున్న శ్రీనివాసులును ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే ఆయనకు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చారనే విషయంపై స్పష్టత లేదు.

టీచ్ టూల్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 2: పెద్దపాడు ఆదర్శ పాఠశాలల్లో రెండో రోజైన మంగళవారం ఉపాధ్యాయులకు టీచ్ టూల్స్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఏపీ సమగ్ర శిక్ష ఎస్‌పీఅండ్‌ఆర్‌జే సంయుక్తంగా నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం పదో తేదీ వరకు జరుగుతుందని ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు టీచ్ ప్రైమరీ, టీచ్ సెకండరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అసిస్టెంట్ ఏఎంవో షేక్ రఫీ, రాష్ట్ర పరిశీలకులు శారదాదేవి, ప్రవీణ్ కుమార్, మహబూబ్ బాషా, బాలతిమ్మారెడ్డి, వెంకట్రాముడు, సుజాత, రమేష్ ట్రైనర్లుగా వ్యవహరిస్తున్నట్లు కోర్సు డైరెక్టర్ రఫీ తెలిపారు.

కేవీఆర్‌కు స్టార్ కళాశాల హోదా

కర్నూలు(అర్బన్), జూలై 2: కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలకు స్టార్ కళాశాల హోదా వరించిందని కళాశాల ప్రిన్సిపాల్ డా. వీవీఎస్ కుమార్ తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ(డీబీటీ)గవర్న మెంట్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ స్టార్ కాలేజీగా ఎంపిక చేసిందని తెలిపారు. ఈ పథకం ద్వారా బాటనీ, జువాలజీ, ఫిజిక్స్ . కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ విభాగాలకు కావలసిన కొత్త పరికరాల కొనుగోలు చేసే వీలు ఏర్పడింది. నూతనంగా వర్క్‌షాపు, సెమినార్లు, ఫీల్డ్ విజిట్స్ నిర్వహించడానికి వీలు ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు డీబీటీ వరుసగా 3 సంవత్సరాలు తగిన నిధులు మంజూరు చేస్తారని, ఈ హోదాకు డా. మైకెల్ డేవీడ్, లెక్చరర్ బాటనీ, కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తారని తెలిపారు.

భక్తునికి బంగారు ఉంగరం అప్పగింత


భక్తునికి బంగారు ఉంగరం అప్పగిస్తున్న శశిధర్‌రెడ్డి

మహానంది, జూలై 2: దైవదర్శనం కోసం వచ్చి మహానంది క్షేత్రంలోని కోనేరులో భక్తుడు జారవిడుచుకొన్న బంగారు ఉంగరాన్ని వెతికించి అప్పగించారు. ఈ సంఘటన మంగళవారం మహానందిలో జరిగింది. కరీంనగర్‌కు చెందిన శ్రీకాంత్ అనే భక్తుడు కుటుంబ సమేతంగా స్వామి దర్శనం కోసం వచ్చారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పుణ్యస్నానాలు చేస్తుండగా ఉంగరం పొరపాటున కోనేరులో పడిపోయింది. ఈ విషయాన్ని భక్తుడు అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బాలుడు దృష్టికి తీసికెళ్లాడు. అతను స్థానిక చెంచులతో కోనేరులో వెతికించి, ఉంగరాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి చేతుల మీదుగా భక్తుడు శ్రీకాంత్‌కు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఎంఈవోకు గాయాలు

పాణ్యం, జూలై 2 : మండలంలోని తమ్మరాజుపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహానంది ఎంఈఓ రామసుబ్బయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఆయన బంధువు మాధవికి కూడా తీవ్ర గాయాలైనట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. మంగళవారం కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రిలో తన మనవడిని చూసి నంద్యాలకు కారులో వెళ్తుండగా టైరు పంక్చర్ అయి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన ఎంఈఓను శాంతిరాం ఆసుపత్రికి తరలించగా మాధవిని హైదరాబాదు అపోలో ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా, జూలై 2: మండలంలోని మండ్లెం- నందికొట్కూరు మధ్య జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామానికి చెందిన వీరశేఖర్, తాటిపాడు గ్రామానికి చెందిన బోయశివ అనే ఇరువురు ఆటోలో తాటిపాడుకు వస్తుండగా ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆటోలో ఉన్న వీరశేఖర్(31)కు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను నందికొట్కూరు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ బోయశివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

వ్యవసాయ సలహా మండళ్లు రద్దు

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 2: గత వైసీపీ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల పరిధిలో వ్యవసాయ సలహా మండళ్లను ఏర్పాటు చేసింది. అయితే.. గత ఐదేళ్లలో రైతుల నుంచి కుప్పలు తెప్పలుగా వ్యవసాయ సలహా మండళ్ల దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి ఎవరూ దృష్టి పెట్టలేదు. దీంతో ఈ వ్యవసాయ సలహా మండళ్లు అలంకారప్రాయంగా మారిపోయాయి. గ్రామ స్థాయి నుంచి మండలం, అదే విధంగా జిల్లా స్థాయిలో సలహా మండళ్లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సలహా మండళ్ల ద్వారా వైసీపీ నాయకులకు పదవులను కట్టబెట్టడం తప్పితే.. వారి ద్వారా రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే ఈ వ్యవసాయ సలహా మండళ్లను రద్దు చేసింది. ఈ నిర్ణయంపట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, అదే విధంగా ప్రకృతి వైపరీత్యాల వంటి సమస్యలను వ్యవసాయ సలహా మండళ్ల పరిష్కరించేందుకు చర్యలు తీసుకోలేదని రైతులు మండిపడుతున్నారు.

మూడు ఏజెన్సీలకు మెమో

కర్నూలు(హాస్పిటల్), జూలై 2: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీలను ఆసుపత్రి సూపరింటెండెంట్ మెమోలు జారీ చేశారు. గత నెల 29వ తేదీ రాష్ట్ర పరిశ్రమల వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ఆసుపత్రిని అకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖిలో భాగంగా శానిటేషన్ సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీల పనితీరు సరిగా లేదంటూ మండిపడ్డ విషయం తెలిసిందే. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ మూడు ఏజెన్సీలకు మెమోలు జారీ చేసి వివరణ కోరారు. ఏజెన్సీ నిర్వాహకులు తాము ఎంవోయూ ప్రకారం పనులు చేస్తున్నామని వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఎంసీహెచ్ భవనంలో పారిశుధ్యం సరిగా లేదని, ఆహారాన్ని తిని రోగులు, వారి సహాయకులు చిన్న పిల్లల విభాగంలో పడవేస్తున్నారని, డస్ట్‌బిన్‌లు ఎక్కడ లేవని మంత్రి మండిపడ్డారు. అలాగే మంత్రి ఆసుపత్రిలో పర్యటిస్తుండగా.. ఐదారుసార్లు విద్యుత్ అంతరాయం జరిగింది. పవర్‌హౌస్ ప్యానల్‌లో ఎలుక చనిపోవడం వల్ల కరెంటు సమస్య తలెత్తిందని మంత్రికి ఎలక్ట్రికల్ సిబ్బంది సమాధానం చెప్పారు. ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతున్నా పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ పనితీరు అధ్వానంగా ఉందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆసుపత్రిలో సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణ సరిగ్గా లేదని, సెల్‌ఫోన్లు బైకులు చోరీకి గురవుతున్నాయని, ట్రాఫిక్ నియంత్రణ సరిగా లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ మూడు ఏజెన్సీల వివరణ అనంతరం అధికారులు ఏం చేస్తారో వేచి చూడాలి.

టెక్నికల్ అసిస్టెంట్‌పై కేసు నమోదు

అవుకు, జూలై 2: అవుకు పట్టణం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జయశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌బాబు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జయశేఖర్‌రెడ్డి ఆరు నెలల నుంచి విధులకు హాజరు కాకుండా మధ్యాహ్నం 1-30 గంటలకు మద్యం సేవించి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి తనకు జీతం ఇవ్వలేదని ఎంపీడీవో మల్‌రెడ్డి ఇతర ఉద్యోగులతో గొడవకు దిగాడన్నారు. విధులకు ఆటంకం కలిగించి బెదిరించినట్లు ఎంపీడీవో ఫిర్యాదు చేయటంతో జయశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డైట్ పర్యవేక్షణ అధికారిగా డా. హేమనళిని


రోగుల భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని

కర్నూలు(హాస్పిటల్), జూలై 2: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఆహారాన్ని అందించే డైట్ పర్యవేక్షణ బాధ్యతలను ఆసుపత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా. హేమనళినికి అప్పగిస్తూ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. డైట్‌ను సక్రమంగా అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ మూడు పూటలా డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో పర్యవేక్షిస్తారని, వారంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సమీక్ష నిర్వహిస్తారన్నారు.

ఓర్వకల్లు పొదుపు ఉద్యమం ఘనత చంద్రబాబుదే

- ఎమ్మెల్యే గౌరు చరిత
- ఘనంగా సన్మానించిన పొదుపు మహిళలు
- 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఘనంగా రజతోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఓర్వకల్లు, జూలై 2: ఓర్వకల్లు పొదుపు ఉద్యమానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం మండల ఐక్యసంఘం గౌరవ సలహాదారాలు విజయభారతి ఆధ్వర్యంలో పొదుపు సంఘాలు ప్రారంభించి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలు బాలభారతి పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. వీరికి విజయభారతి ఆధ్వర్యంలో పొదుపు మహిళలు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పొదుపులక్ష్మి మండల ఐక్యసంఘం గౌరవసలహాదారు విజయభారతి మాట్లాడుతూ అప్పటి చంద్రబాబు ముఖ్యమంత్రి హయాంలో 1995లో డ్వాక్రా సంఘాలను ఏర్పాటయ్యాయని అన్నారు. మండలంలో 1279 సంఘాలు, 12,008 మంది పొదుపు సభ్యులతో మండల ఐక్య సంఘం రూ.35 కోట్లు టర్నోవర్ ఉందన్నారు. అనంతరం కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ 30 సంవత్సరాల్లో ఓర్వకల్లు పొదుపు ఉద్యమం దేశదేశాలకు కూడా ఒక మోడల్‌గా నిలిచిందని అన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ పొదుపు మహిళలు దినాదినాభివృద్ధి చెందుతూ దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. 1995లో డ్వాక్రా సంఘాలలో పొదుపు ఉద్యమాన్ని సీఎం చంద్రబాబు మొదలు పెట్టారని, ఓర్వకల్లు మండలంలో ఇది దినదినాభివృద్ధి చెందిందని అన్నారు. టీడీపీ నంద్యాల అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితను, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లను పొదుపు మహిళలు గజమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎంపీడీవో మల్లేశ్వరి, తహసీల్దార్ నటరాజ్, సర్పంచులు చంద్రగోవర్ధనమ్మ, వెంకటరమణమ్మ, ఉప సర్పంచ్ షమీనాబీ, నంద్యాల టీడీపీ పార్లమెంటు అధ్యక్షురాలు పార్వతమ్మ, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు రాము, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, సుధాకర్ రెడ్డి, సుధాకర్‌రావు, లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, తిప్పాయపల్లె సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గౌరు చరితను గజమాలతో సన్మానిస్తున్న పొదుపు మహిళలు

మాజీ ఎమ్మెల్యే వద్దే మా పట్టాలు

- స్థలం చూపించి న్యాయం చేయండి
- తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన మహిళలు


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన మహిళలు

ఆదోని రూరల్, జూలై 2 : మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వద్దే తమ ఇంటి పట్టాలు ఉన్నాయని, ఇవ్వకుండా వేధిస్తున్నాడంటూ ఆదోని పట్టణానికి చెందిన మహిళలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద ఉన్న ప్రభుత్వ స్థలానికి ఇంటి పట్టా కోసం రూ.2,100 డీడీ కట్టామని, అయితే కొందరికి పట్టాలు ఇచ్చి స్థలం చూపించలేదని అన్నారు. మరికొంత మందికి పట్టాలు కూడా ఇవ్వలేదని దాదాపు 50 మంది మహిళలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాల కోసం సాయిప్రసాద్‌రెడ్డి ఇంటి వద్దకెళ్తే సాయన్న లేడంటూ అక్కడున్న వారు చెబుతున్నారని వాపోయారు. సాయిప్రసాద్‌రెడ్డి ఇంటి చుట్టూ తిరగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ హసినా సుల్తానాకు వినతి పత్రం అందజేశారు.

కర్నూలు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సహకరించండి

మంత్రి రామ్మోహన్‌నాయుడును కోరిన ఎంపీ బస్తిపాటి నాగరాజు


మంత్రిని సన్మానించిన ఎంపీ

కర్నూలు(అర్బన్), జూలై 2: కర్నూలు విమానాశ్రయాభివృద్ధికి సహకరించి విజయవాడ, తిరుపతి నగరాలకు విమాన సర్వీసులు అందించాలని ఎంపీ. బస్తిపాటి నాగరాజు కోరారు. మంగళవారం డిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును కలిసి వినతి పత్రం ద్వారా కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

నంద్యాల టౌన్, జూలై 2 : వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వై. మురళీకృష్ణ అన్నారు. మంగళవారం నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు కార్యాలయంలో నంద్యాల, మహానంది, బండిఆత్మకూరు మండలంలోని పనిచేస్తున్న వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈవో, ఏఈవోలకు 2024 ఖరీఫ్ ప్రణాళిక, కార్యాచరణ ఏడీఏ డి. రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి వై .మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పనిచేసే వ్యవసాయ సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికతను రైతులకు తెలియజేయాలని అన్నారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మండలాల్లో జూన్ నెల సగటు వర్షపాతం 77.77 మిల్లీ మీటర్లు కాగా 214.28 మిల్లీమీటర్లు పడిందని అన్నారు. వర్షపాతం ఆశాజనకంగా ఉండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో ఉన్నారని వారికి గ్రామ స్థాయిలో అందరూ అందుబాటులో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల, మహానంది, బండిఆత్మకూరు మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

వాహనాలను కండిషన్‌లో ఉంచుకోవాలి: ఎస్పీ


వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, జూలై 2 : నంద్యాల జిల్లాలో వివిధ ప్రజా సేవలకు వినియోగించే పోలీసు వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో పట్టణంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ఇచ్చిన పోలీస్ వాహనాల (బ్లూ కోర్ట్స్)ను ఎస్పీ పరిశీలించారు. అనంతరం వాహనాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాహనాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, కండీషన్‌లో ఉంచుకోవాలని పేర్కొన్నారు. వాహనాలకు పెయింటింగ్, పోలీస్ స్టిక్కర్లు, అత్యవసర హారన్ తదితరాలను సక్రమంగా అమర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, జిల్లా మోటార్ వెహికల్ విభాగ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, నంద్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్లు నరసింహులు, చలపతి, మంజునాథ్, సురేష్, సూర్యమౌళి, బ్లూ కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

పాములపాడు, జూలై 2: పాములపాడు బస్టాండు సమీపంలో టిప్పరు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. మంగళవారం ఎర్రగూడూరు గ్రామానికి చెందిన భిక్షపతి, సుజాత దంపతులు చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. వీరు వ్యాపారం ముగించుకొని పాములపాడు నుండి స్వగ్రామం వెళుతుండగా చెలిమిళ్ల రస్తా మలుపు వద్ద బైక్, టిప్పర్ ఢీ కొనడంతో సుజాత తలకు తీవ్ర గాయాలు అవడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం 108లో కర్నూలుకు తరలించారు.

మద్దూరులో హత్య

పాణ్యం, జూలై 2 : మండలంలోని మద్దూరులో మంగళవారం దూదెకుల దస్తగిరి (51)పై అదే గ్రామానికి చెందిన వడ్డె రామాంజనేయులుతోపాటు మరి కొందరు కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు పాణ్యం సీఐ నల్లప్ప తెలిపారు. పాత గొడవలే హత్యకు దారితీసినట్లు వెల్లడించారు. మూడు నెలల క్రితం ఇరువురి మధ్య గొడవ జరిగినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా, జూలై 2: మండలంలోని మండ్లెం- నందికొట్కూరు మధ్యలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామానికి చెందిన వీరశేఖర్, తాటిపాడు గ్రామానికి చెందిన బోయ శివ అనే ఇరువురు ఆటోలో తాటిపాడుకు వస్తుండగా ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆటోలో ఉన్న వీరశేఖర్(31) తీవ్రగాయాలయ్యాయి. ఆయనను నందికొట్కూరు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ల క్ష్మీనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

కోడుమూరు, జూలై 2: స్థానిక సీతా రాముల దేవాలయం దగ్గర మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. క్రిష్ణగిరి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై అతి వేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును క్రాస్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎర్రగుడి గ్రామానికి చెందిన తిమ్మరాజు (17) బస్సు కింద పడ్డాడు. పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బైక్‌పై ఉన్న అదే గ్రామానికి చెందిన మరో యువకుడు రంగస్వామికి సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు సాగిస్తున్నారు.

ఉపాధ్యాయుడి మృతి

కొత్తపల్లి, జూలై 2: ఆత్మకూరు పట్టణంలోని తోటగేరికి చెందిన తోట నాగలక్ష్మయ్య (58) అనే ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందాడు. నాగలక్ష్మయ్య కొత్తపల్లి మండలం కొత్తమాడుగుల ఎంపీయూపీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం పాఠశాలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉన్న ఫలంగా ఛాతిలో నొప్పి రావడంతో తరగతి గదిలోనే కుప్పకూలిపోయాడు. మరో ఉపాధ్యాయుడు గ్రామస్థుల సహకారంతో ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే నాగలక్ష్మయ్య మరణించాడని వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన ఉపాధ్యాయుడు 98-డీఎస్సీలో గత ఏడాది విధుల్లో చేరారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి ఎంఈవో శ్రీరాములు ఆత్మకూరు రిటైర్డు ఎంఈవో జానకిరాముడుతోపాటు సహచర ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు. మృతునికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బాలుడి మృతిపై డీసీహెచ్ విచారణ

మృతి చెందిన శిశువు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 2: ఎమ్మిగనూరు పట్టణంలో గత వారం క్రితం ముగతి గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా భార్య అక్తర్‌బేగం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి చేరి మగ శిశువు జన్మనిచ్చింది. నవజాత శిశువు వారం రోజుల తరువాత అనారోగ్యంతో మృతి చెందగా, పసికందు తల్లితండ్రులు స్థానిక సూపరింటెండెంట్ నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందినట్లు డీసీహెచ్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు డీసీహెచ్ మాధవి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి చేరుకొని శిశువు మృతిపై విచారణ చేపట్టారు. అలాగే గర్భిణులను, రోగులను, ఆసుపత్రి సూపరింటెండెంట్ మైత్రి, వైద్యులను ఇతర సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా డీసీహెచ్ మాధవి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి, అధికారులకు అందచేస్తామని తెలిపారు.

ఎనిమిది మందిపై హత్యాయత్నం కేసు నమోదు

గడివేముల, జూలై 2: మండలంలోని వండుట్ల గ్రామానికి చెందిన ఎనిమిది మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. వండుట్ల గ్రామానికి చెందిన రవింద్రారెడ్డి, వెంకటరమణ, సురేష్‌లు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గణేష్‌రెడ్డి, రామగోవిందు, మరో ఆరుగురు రవింద్రారెడ్డిపై హత్యాయత్నం చేశారన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం


గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైన ఇల్లు

వెల్దుర్తి, జూలై, 02: మండలంలో పుల్లగుమ్మి గ్రామంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం మండలంలో జరిగింది. గ్రామానికి చెందిన సామన్న, అయన భార్య, కుమారుడు ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. గ్యాస్ సిలిండర్ పేలి మట్టి ఇంటి పైకప్పు ఎగిరిపోయి మంటలు ఎగసిపడడంతో చుట్టూపక్కల వాళ్లు కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న బియ్యం బస్తాలు, బీరువా, బట్టలు, ఇంట్లో సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. నగదు రూ.లక్ష, బీరువాలో దాచిన 5 తులాల బంగారు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.6లక్షలు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. డోన్ నుంచి ఫైర్ ఫైరింజన్‌తో సిబ్బంది వచ్చి మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా నియంత్రించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని టీడీపీ నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి భరోసా యిచ్చారు. ఈ సంఘటన స్థలాన్ని వీఆర్‌వో ఎల్లకృష్ణ, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సందర్శించి వివరాలు సేకరించారు.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ భావనరెడ్డి

బండిఆత్మకూరు, జూలై 2: గ్రామాల్లో సీజనల్‌గా వ్యాప్తిచెందే అతిసార వ్యాధి పట్ల సిబ్బంది, ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ భావన రెడ్డి సూచించారు. మంగళవారం బండిఆత్మకూరు పీహెచ్‌సీలో ఆశా, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి ట్యాంక్‌ల శుభ్రత, పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు. వాంతులు, విరేచనాలు అయితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.

సొసైటీ ఛైర్మన్ రాజీనామా

బండిఆత్మకూరు, జూలై 2: మండలంలోని ది పరమటూరు రైతు సేవా సహకార పరపతి సంఘం ఛైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు నియమిత ఛైర్మన్ బూరం శివలింగం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఛైర్మన్ పదవితోపాటు, వైసీపీ పార్టీకి సైతం రాజీనామా చేస్తున్నాని తెలిపారు. ఇంతవరకు సహకరించిన రైతులకు, గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఓంకారంలో బుడ్డా దంపతుల పూజలు



ఓంకార సిద్ధేశ్వరస్వామి వారికి అభిషేకాలు చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా దంపతులు

బండిఆత్మకూరు, జూలై 2: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార క్షేత్రంలో గంగా, ఉమా సమేత సిద్ధేశ్వర స్వామి వార్లను ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, సతీమణి శైలజ దర్శించుకున్నారు. మంగళవారం ముందుగా కానూరు గ్రామంలోని సరస్వతీ నారాయణ ఆశ్రమాన్ని వారు దర్శించి, సరస్వతీదేవికి, కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఉన్న అన్నపూర్ణేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ సేవకుడు నాగేశ్వర్‌రెడ్డి అమ్మవారి వస్త్రాలు ఎమ్మెల్యే దంపతులకు అందజేశారు. అక్కడే భోజనాలు చేశారు. నాయకులు రామలింగారెడ్డి, సురేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మనోహర్‌చౌదరి, ఈశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి, శంకర్‌రెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.

4న విద్యా సంస్థల బంద్

నంద్యాల (నూనెపల్లె), జూలై 2: నీట్ పరీక్ష పేపర్ లీకేజ్, అవకతవకలపై 4న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఐపీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నీట్ అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఎన్టీఏ సంస్థను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బంద్‌ను జయప్రదం చేయండి

● వామపక్షాల విద్యార్థి జేఏసీ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష విద్యార్థి జేఏసీ నాయకులు

నందికొట్కూరు, జూలై 2: లీకేజ్, అవకతవకలపై 4న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న బంద్‌ను జయప్రదం చేయాలని నందికొట్కూరు పట్టణంలోని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆది, ఏఐఎస్ఏ డివిజన్ ప్రధాన కార్యదర్శి రంగస్వామి, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు దినేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు హరి డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఎన్డీఏ అసమర్థ ఆలోచనల విధానం వల్ల దేశంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన నీట్, నెట్ పరీక్షా పత్రాలు లీక్ అవడం ఎంతో దారుణమన్నారు. పదిసంవత్సరాల బీజేపీ పాలనలో 62 సార్లు పేపర్లు లీకైన బీజేపీ పార్టీ వీటిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దేశ వ్యాప్త బంద్‌లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

● ఆయిల్, వేరుశనగ విత్తనాల శాంపిల్స్ సేకరణ




హోటల్‌లో వినియోగిస్తున్న ఆయిల్ శాంపిల్స్‌ను సేకరిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

నందికొట్కూరు, జూలై 2: నందికొట్కూరు పట్టణంలోని పాండు టిఫిన్‌సెంటర్‌పై ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఓ వినియోగదారుడు కల్తీనూనెలను వాడుతున్నారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందికొట్కూరు పట్టణంలోని మిడ్తూరు రోడ్డులో ఉన్న పాండు టిఫిన్ సెంటర్‌పై ఫుడ్‌సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, ఖాసీం వలీ తనిఖీలు నిర్వహించారు. టిఫిన్ సెంటర్‌ను పరిశీలించిన అధికారులు నూనెను, నాసిరకంగా ఉన్న వేరుశనగ విత్తనాలు, కూరగాయల శాంపిల్స్‌ను సేకరించినట్లు ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ వెంకటరాముడు తెలిపారు. ల్యాబ్‌లో వాటిని పరిశీలించాక నాణ్యతలో కల్తీ కనిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఉదయం హోటల్‌లో పూరి తిన్నానని అప్పటి నుంచి కడుపులో మంటగా ఉందని ఏసేపు అనే వినియోగదారుడు తెలిపారు.

నేడు సగర సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల (నూనెపల్లె), జూలై 2: నంద్యాల జిల్లా సగర సంఘం నూతన కమిటీ ఎన్నికను బుధవారం స్థానిక సంబులా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపపరి సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం సుంకులా పరమేశ్వరి దేవ్థానంలో ఆయన మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా ఏర్పడిన అనంతరం నూతనంగా నంద్యాల జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కమిటీ సభ్యులు విడుదలచేశారు. జిల్లాలోని సగరులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు బాలాజీ, నాయకులు శివయ్య, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, చిన్నయ్య, వెంకటరాముడు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనంతోనే.. అధిక దిగుబడి



● విత్తనాల కొనుగోలులో జాగ్రత్తగా ఉండాలి ● ధ్రువీకరించిన విత్తనాలనే వాడాలి

నంద్యాల టౌన్, జూలై 2 : విత్తనాల నాణ్యత సరిగా లేకపోతే దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రైతులు ఎంత యాజమాన్య పద్ధతులు పాటించినా నాణ్యమైన విత్తనం ఉపయోగించకపోతే పంటలో ఆశించిన దిగుబడులు సాధించేందుకు వీలుకాదు. మేలు రకమైన విత్తనం వాడటం వల్ల 20-25 శాతం అధిక దిగుబడి పొందే అవకాశం ఉంది. వ్యాపారులు నాసిరకం విత్తనాలను అంటగట్టడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే అధికారులు సూచించిన, ధ్రువీకరించిన విత్తనాలనే వాడాలి.

నాణ్యమైన విత్తన లక్షణాలు




రైతు ఎంచుకున్న రకం సంతతికి మాత్రమే చెంది, వంద శాతం జన్యుశుద్ధత కలిగి ఉండాలి. 98 శాతం బాహ్య స్వచ్ఛత కలిగి ఉండాలి. ఇతర పంట జాతులు, ఇతర రకాలకు చెందిన కలుపు విత్తనాలు, జడ పదార్థాలు ఉండరాదు. అధిక దిగుబడినిచ్చే రకం లేదా హైబ్రిడ్ రకాలు వాడాలి. విత్తనం పంటను బట్టి 75 నుంచి 90 శాతం మొలకెత్తే శక్తి ఉంటుంది. విత్తనంలో తగినంత తేమ శాతం (ధాన్యపు పంటలలో 10 నుంచి 12 శాతం, అపరాలలో 8 నుంచి 9 శాతం) ఉండాలి. విత్తనంలో మొలకెత్తే శక్తి(విగర్) అధికంగా ఉండాలి. విత్తనం చిడపీడలను కలుగజేసే బీజాలు లేకుండా ఆరోగ్యవంతమైనదిగా ఉండాలి. విత్తనం సురక్షితమైన ప్యాకింగ్, విత్తనం వివరాలు తెలియజేసే లేబులు కలిగి ఉండాలి.

విత్తనాల ఎంపిక.. కొనుగోలులో జాగ్రత్తలు



రైతులు విత్తనాలను తనకు బాగా తెలిసిన, నమ్మకమైన అనుమతి గల విత్తన డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. రైతులు విత్తనాలు కొనే సమయంలో విత్తన సంచికి కట్టి ఉన్న, ముద్రించి ఉన్న లేబుల్‌ను తప్పక పరిశీలించాలి. లేబుల్ ఉన్నవాటినే రైతులు కొనుగోలు చేయాలి. రైతు కొనుగోలు చేసిన విత్తనానికి పూర్తి వివరాలతో కూడిన రశీదును డీలర్ నుంచి విధిగా తీసుకోవాలి. ఈ రశీదును, ఖాళీ విత్తన సంచిని పంట పూర్తయ్యే వరకు రైతు జాగ్రత్త పరుచుకోవాలి. విత్తనాలను రైతు సేకరించుకున్న వెంటనే విత్తనం డూప్లికేట్ లేదా నాణ్యతలో అనుమానాలు ఉంటే తన సమీప వ్యవసాయ అధికారి ద్వారా విత్తనాలను పరీక్షా కేంద్రానికి పంపి, విత్తన నాణ్యతా ప్రమాణాలను పరీక్షించుకోవాలి. అధిక దిగుబడులు వస్తాయని, చౌకగా మంచి విత్తనాలు సరఫరా చేస్తామని, రైతులను ప్రలోభాలకు గురి చేసే మధ్య దళారులు, మోసకారి వ్యాపారుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు కొనుగోలు చేయరాదు.

ధ్రువీకరించబడిన విత్తనాల వాడకం వల్ల లాభాలు





జన్యుపరమైన లక్షణాలు కలిగి పైరు సమానంగా ఉంటుంది. చీడ పీడలను తట్టుకొనే శక్తి అధికంగా ఉంటుంది. బాహ్య స్వచ్ఛత కలిగి ఉండి, ఇతర పంట విత్తనాలు కాని, కలుపు మొక్కల విత్తనాలు గానీ లేకుండా పరిశుభ్రంగా ఉంటాయి. వ్యర్థ పదార్థాలు లేకుండా ధృడమైన విత్తనాలు ఎక్కువ శాతం కలిగి ఉంటాయి. అధికంగా మొలకెత్తే శక్తి కలిగి, బాగా మొలకెత్తి, ఎక్కువ మొలక సాంద్రత కలిగిన విత్తనాలు అధిక దిగుబడికి దోహదపడతాయి. మంచి మేలైన మొలకలు వస్తాయి. ఆరోగ్యమైన విత్తనం, విత్తనంద్వారా వ్యాపించు శిలీంద్రాల నుంచి రక్షణ ఎక్కువగా ఉంటుంది. విత్తనంలో నిర్ణీత తేమ శాతం వల్ల ఎక్కువ కాలం నిల్వ చేయవచ్చు. ధ్రువీకరించిన విత్తనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, జాతీయ విత్తన సంస్థ, నమ్మకమైన విత్తన విక్రయ సంస్థలు, అమ్మకపుదారుల నుంచి రైతులు కొనుగోలు చేయాలి.



ఎర్రమఠంలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, ఇన్‌చార్జి మాండ్ర



పాములపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

హామీని నెరవేర్చిన సీఎం చంద్రబాబు

● నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర

కొత్తపల్లి, జూలై 2: సార్వత్రిక ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మంగళవారం వారు మండలంలోని ఎర్రమఠం, కొత్తపల్లి గ్రామాల్లో రెండోరోజు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కొత్తపల్లి గ్రామ సచివాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్యతో పాటు మాండ్ర పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలు దశలవారిగా అమలవుతున్నాయని వివరించారు. అనంతరం మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో నిధుల్లేక మధ్యలో నిలిచిపోయిన కొత్త మాడుగుల గ్రామం వద్ద మంచినీటి పథకాన్ని త్వరలో పూర్తి చేసి శుద్ధజలాలు అందిస్తామన్నారు. అంతేగాకుండా మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే విదంగా ఇరిగేషన్ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో దుద్యాల గ్రామ పంచాయతీకి మంజూరు చేసిన మహేంద్ర ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్‌బాబు, తహసీల్దార్ తిరుపతయ్య, నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, నారపురెడ్డి, లింగస్వామిగౌడు, శ్రీనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చంద్రారెడ్డి, సీలం లింగన్న, రామిరెడ్డి, మోహన్, జడ్.వెంకటరెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, నాగేశ్వరరావు యాదవ్, అల్లీబాషా, స్వామిరెడ్డి, మల్లారెడ్డి, రఫీ, సుధాకర్, డీలర్ వెంకటస్వామి, జానకీ రాముడు, మాసుమయ్య, పోతుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: గతంలో తెలుగుదేశం పార్టీలోనే లిఫ్టులు ఏర్పాటు చేసి రైతులకు సాగునీరందించిన ఘనత ఒక్క టీడీపీకే దక్కిందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మంగళవారం పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ట్రాక్టర్లను పంపిణీ చేశారు అనంతరం సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇస్కాల, మాల్యాల ఎత్తిపోతల పథకం వాటర్ స్కీంలు ఏర్పాటు చేసి వేల ఎకరాలకు సాగునీరందించి బంజరు భూములను బంగారు భూములుగా మార్చమన్నారు. పోలవరం పూర్తయితే రాయలసీమ సస్యశామలం అవుతుందని, పోలవరం నుంచి బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు నీళ్లు వస్తాయన్నారు. ఎస్సీ కాలనీలోని వికలాంగుల పింఛను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళగడ్డ హరిసర్వోత్తమరావు, తిమ్మారెడ్డి, హరినాథ్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వరరావు, గోవిందు, మధుక్రిష్ణ చంద్రశేఖర్, జనార్ధన్‌రెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాముచౌదరి, ఏసేపు, అలీసాహెబ్, హరిప్రసాద్, లింగస్వామి, లింగేశ్‌గౌడ్ మండల అధికారులు పాల్గొన్నారు.

30 వేల ఎకరాలకు సాగు నీరు

జూపాడుబంగ్లా: కృష్ణానదిపై ఎత్తిపోతలను ఏర్పాటు చేసి 30వేల ఎకరాలకు సాగు నీరు అందించనున్నట్లు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంటు సమన్వయకర్త మాండ్రశివానందరెడ్డి అన్నారు. మంగళవారం జూపాడుబంగ్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తంగడంచలో ఏర్పాటు చేసిన జైన్ ఇరిగేషన్, సీడ్‌హబ్‌లను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యువతకు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని హామీ ఇచ్చారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదర్శపాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, పాఠశాలకిట్టు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యహన్ఏపీఎం అంబమ్మ, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వరరెడ్డి, మండల నాయకులు మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, సుధాకర్, రవికుమార్‌యాదవ్, జంగాల పెద్దన్న,బాబు వేణుగోపాల్‌రెడ్డి, రవికాంత్, బాలమద్దిలేటి, గోరేసాహెబ్, ఉసేనయ్య, శేఖర్‌గౌడు, ఉస్మాన్‌బాషా, మన్సూర్‌బాషా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించండి

గడివేముల, జూలై 2: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రోగ్రామ్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి ఆశా వర్కర్లను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో తలమొడిపి వైద్యాధికారి మద్దిలేటి, ఎంపీహెచ్ఈవో మహేశ్వర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుడిని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్

ఆత్మకూరు, జూలై 2: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్. బాబు అనే విద్యార్థిని పరుష పదజాలంతో దురుసుగా వ్యవహరించిన అధ్యాపకుడు సుధాకర్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్ పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన అధ్యాపకులు విద్యార్థులపై దురుసుగా వ్యవహరించడంతో పాటు భౌతిక దాడులకు పాల్పడటం అమానుషమని అన్నారు. అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

శ్రీశైలం, జూలై 2: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

నంద్యాల (కల్చరల్), జూలై 2: నంద్యాల చిత్తలూరివారి వీధిలో వెలసిన శ్రీకృష్ణ భజనమందిరం, పద్మావతీనగర్‌లో వెలసిన శ్రీకృష్ణమందిరంలో మంగళవారం ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సుదీంద్రాచార్యులు ఉదయం స్వామివారికి పంచమృతాభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు.

ఉత్తమ ప్రతిభకు పురస్కారాలు

గడివేముల, జూలై 2: ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో మంగళవారం స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ప్లాంట్ ఇన్‌చార్జి నవనీత్‌చౌహాన్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తోడ్పాటు కల్పించేందుకు జిందాల్ పరిశ్రమ స్కాలర్‌షిప్‌లను పదోతరగతి నుంచి పీజీ వరకు ప్రతిభ కనబరిచిన 76 మంది విద్యార్థులకు సుమారు రూ.14 లక్షలు విలువ చేసే స్కాలర్‌షిప్‌లను జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిందాల్ పరిశ్రమ సిబ్బంది, ఎంఈవో, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకేతు పూజలు

పాణ్యం, జూలై 2 : మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు భక్తి శ్రద్ధలతో రాహుకేతు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు వీరయ్యస్వామి, నారాయణస్వామి, సురేష్ శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నిత్య కళారాధన



గీతాలను ఆలపిస్తున్న గాయని

శ్రీశైలం, జూలై 2: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం నెల్లూరుకు చెందిన మల్లాది అనూష బృందంచే గాత్రకచేరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శివ శివ శంభో, కాలభైరవాష్టకం, విజయాంబికే, సకల మంత్రముల, అంబావాణీ, గౌరీ మనోహర తదితర గీతాలను మల్లాది అనూష ఆలాపించారు.

పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు శిక్షణ



చేతులను శుభ్రం చేసుకుంటున్న ఉపాధ్యాయులు

నందికొట్కూరు, జూలై 2: నందికొట్కూరు పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో డెటాల్ బనేగా స్వస్థ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిడ్తూరు, నందికొట్కూరు మండలాల్లోని 36 పాఠశాలల నోడల్ అధికారులకు, ఉపాధ్యాయులకు పాల్గొన్నారు. ఈ సమావేశానికి నందికొట్కూరు ఎంఈవో ఫైజున్నీస్సా బేగం మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, ఇంటి వద్ద శుభ్రత, స్కూలు వద్ద శుభ్రత, వ్యాధి ఉన్నప్పుడు శుభ్రత ఇరుగుపొరుగు వారి వద్ద శుభ్రత గురించి తెలియజేశారు. మిడ్తూరు ఎం.ఈవో రామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పరిశుభ్రతపై పాఠశాలలో పిల్లలకు తెలిజేయడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎ.ఆర్.డి.ఎస్ ప్రాజెక్టు మేనేజర్ ఎ.ఎస్. కుమారి, ట్రైనింగ్ ప్రోగాంలో డీబీఎస్ఐ ప్రాజెక్టు స్టేట్ మేనేజర్ ఎ.ఎస్ కుమారి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పుల్లన్న పాల్గొన్నారు.

కొత్త నేర చట్టాల అమలును వాయిదా వేయాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 2: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా కొత్త నేర చట్టాలను అమలు చేయాలన్న నిర్ణయాన్ని వాయిదా వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రజావ్యతిరేక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నిరంతరం తీసుకు వస్తుందని ఇందులో భాగంగానే పార్లమెంట్‌లో కొత్త చట్టానికి వ్యతిరేకంగా 140 మంది పార్లమెంట్ సభ్యులను మార్షల్స్ చేత బయటకు పంపించి ఐపీసీ స్థానంలో భారత న్యాయ సంహిత చట్టాన్ని, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారత నాగరిక్ సురక్ష సంహిత చట్టాన్ని, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అదినియం చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమన్నారు. మూడు చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు, ఏఐటీయుసి నాయకులు సుంకయ్య, రాధాకృష్ణలు పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ



కర్నూలులోని ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి



కర్నూలు వైద్యశాలలో చికిత్స చేయించుకుంటున్న లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న హెల్త్ సెక్రటరీ

ఆత్మకూరు, జూలై 2: మండలంలోని బాపనంతాపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి అనే లబ్ధిదారుడు అనారోగ్యం కారణంగా కర్నూలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఎన్టీఆర్ భరోసా కింద మంజూరైన రూ.7వేల పింఛన్ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ మాలిక్ బాషా మంగళవారం కర్నూలులో ఆయన చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు నాగిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

పాములపాడు: మండలంలోని చెలిమిళ్ళ గ్రామానికి చెందిన గణముల గజపతి అనే లబ్ధిదారుడు కర్నూలులో కిడ్నీవ్యాధికి సంబంధించిన డయాలసిస్ కారణంగా ఆసుపత్రిలో ఉండటంతో హెల్త్ సెక్రటరీ వేల్పుల శ్వేత మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పింఛన్‌ను అందజేసింది. సెక్రటరీని గ్రామస్తులు, లబ్ధిదారుడు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నంద్యాల (నూనెపల్లె), జూలై 2: రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు నంద్యాల జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన అండర్-19 బాల బాలికల చెస్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. జూలై 18,19 తేదీలలో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వారు తెలిపారు.

పేదోళ్లకు పింఛన్ పండుగ

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

రుద్రవరం, జూలై 2: అవ్వాతాతలకు రూ.7వేలు పింఛన్‌ను దేశంలో ఎక్కడ లేని విధంగా తమ ప్రభుత్వం అందించిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. రుద్రవరం గ్రామంలో మంగళవారం లక్ష్మీదేవి, రాజు దంపతుల కుమార్తె మానసిక దివ్యాంగురాలైన చిన్నతేజకు పింఛను డబ్బులు పంపిణీ చేశారు. మానసిక దివ్యాంగురాలు చిన్నతేజకు రూ.6వేలు పింఛను అందించారు. ఇకపై రూ.15వేలు పింఛను అందేలా చర్యలు తీసుకుంటామని ఆ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు మురళీమోహన్, ఎంపీడీవో రామచంద్ర, టీడీపీ నాయకులు రంగనాయుకులు పోలా గురుమూర్తి, ఎస్సీసెల్ కార్యదర్శి రాజారావు, ఎర్రం ప్రతాప్‌రెడ్డి, చిన్నిక్రిష్ణ, కాంతు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే పేదల సంక్షేమం

చాగలమర్రి: రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడుతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని గుంతపాలెం వీధిలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు మరోసారి తానెంటో నిరూపించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఎంఈవో అనూరాధ, ఏవో రంగనేతాజీ, విద్యుత్ ఏఈ షాజహాన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

శిరివెళ్ల: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా శిరివెళ్లలోని పలు కాలనీల్లో పర్యటించి లబ్ధిదారులకు ఆమె మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. అధికారుల సమన్వయంతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, బీసీ ఖాజా హుసేన్, శ్రీనివాసులు, శ్రీకాంత్, బాలచంద్రుడు, లింగమయ్య, పెదరాయుడు, రవి, పీపీ లింగమయ్య, వెంకట సుబ్బయ్య, నవీన్, ఫిదా హుసేన్, సిద్ధిఖ్, రఫి, నరేంద్ర, రమేష్, సికిందర్, మురళి పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

బనగానపల్లె: ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పంపిణీ చేసి సీఎం చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకున్నారని మండల టీడీపీ నాయకుడు బాబయ్య అన్నారు. మంగళవారం బనగానపల్లె మండలంలోని చెర్లోకొత్తూరులో రెండో రోజు మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. బాబయ్య మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చి వైసీపీకి ప్రతిపక్షహోదా లేకుండా కూడా చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి పలువురికి మంగళవారం రెండో రోజు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్‌దారులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వల్లెపు శంకర్ పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలోని అలేబాదు గ్రామంలో మంగళవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి వృద్ధులు, వికలాంగులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ పెంచి తమ జీవితాల్లో చంద్రబాబు వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి పరమేష్, మల్లికార్జున, హరి, చంద్ర పాల్గొన్నారు.

దొర్నిపాడు: టీడీపీతోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని బుర్రారెడ్డిపల్లె సర్పంచ్ గుర్రాతి వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకుడు పగడాల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం వృద్ధులకు రూ.7 వేలు పింఛన్ అందించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో 98 శాతం పింఛన్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, ఆకుల వెంకటరమణ, రామకృష్ణ, అస్లామ్‌బాషా, ఉసేన్‌బాషా, మహదేవుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అలేబాదు, పలుకూరులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు, నాయకులు


రుద్రవరంలో మానసిక దివ్యాంగురాలికి పింఛన్ డబ్బులు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


చెర్లోకొత్తూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు బాబయ్య


బుర్రారెడ్డిపల్లెలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ వెంకటసుబ్బయ్య

ఎమ్మెల్యే దంపతులకు పీఠాధిపతి ఆశీస్సులు


అహోబిలం పీఠాధిపతి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే అఖిలప్రియ దంపతులు

నంద్యాల, జూలై 2(ఆంధ్రజ్యోతి): అహోబిలం పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ ఆశీస్సులను ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆమె భర్త బార్గవ్‌రామ్‌నాయుడు తీసుకున్నారు. వీరి రాకను పురస్కరించుకొని ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దిగువ అహోబిలంలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

పంచపర్వ ఏకాదశి పూజలు

నంద్యాల, జూలై 2(ఆంధ్రజ్యోతి): దిగువ అహోబిలం మఠంలోని లక్ష్మీనరసింహస్వామికి పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ పంచ పర్వ ఏకాదశి పూజలను మంగళవారం నిర్వహించారు. వేదపండితులు వేకువ జామున్నే ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి స్వామి వారికి పంచపర్వ ఏకాదశి పూజలతో పాటు అభిషేకం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే

రుద్రవరం, జూలై 2: రుద్రవరం బెస్తకాలనీలో రహదారులపై వర్షం నీరు నిల్వ ఉండడంతో ఇలా ఉంటే ప్రజలు రోగాల బారిన పడారా అం టూ అధికారులను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నిలదీశారు. మంగళవారం ఆమె రుద్రవరంలో పర్యటించారు. అధికారులు వైసీపీ పాలనలో ఇక్కడ టీడీపీ వారు ఉన్నారంటూ సీసీ రోడ్లు వేయలేదని ప్రజలకు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ రహదారులు నిర్మించేందుకు నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

ఇంటి పన్ను వసూలు చేయండి

రుద్రవరం, జూలై 2 : మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఉన్న 21 గ్రామపంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు చేయాలని కార్యదర్శులను ఈవోపీఆర్‌డీ శ్రీనివాసశర్మ మంగళవారం సూచించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్ను, నీటిపన్ను వసూలు చేసి ఆ మొత్తాన్ని చలానా ద్వారా చెల్లించాలన్నారు. పేరూరు గ్రామ పంచాయతీకి సంబంధించి పంచాయతీ పన్ను కార్యదర్శి కె.ప్రభాకర్ వసూలు చేసిన మొత్తం పంచాయతీకి జమ చేయలేదని తెలిపారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈవోపీఆర్‌డీ తెలిపారు.

వలంటీర్ల జీతాలు ఇవ్వలేదంటూ ఆందోళన


ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

చాగలమర్రి, జూలై 2: చాగలమర్రి గ్రామంలో ఎన్నికల ముందు రాజీనామ చేయని వలంటీర్లు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఎన్నికల ముందు రెండు నెలల పాటు విధులు నిర్వహించిన జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వలంటీర్లకు జీతాలు ఇచ్చారని, తమకు మాత్రం జీతాలు ఇవ్వలేదని వలంటీర్లు వాపోయారు. జీతాలు ఇవ్వాలంటూ సంబంధిత ఈవోకు తెలిపిన జీతాలు ఇవ్వలేదని అన్నారు. ఎంపీడీవో సూర్యనారాయణ వద్దకు వెళ్లి తమకు రెండు నెలల జీతాలు ఇవ్వలేదని, కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని వలంటీర్లు వాపోయారు. ఈ విషయం గురించి ఎంపీడీవో స్పందించి రెండు నెలల జీతాల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వలంటీర్లు వెనుతిరిగి వెళ్లారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

డోన్(రూరల్), జూలై 2: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డోన్ మున్సిపల్ కమిషనర్ జయరాం అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ సమావేశ భవనంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. డెంగీ, మలేరియా, అతిసార వ్యాధులు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని డాక్టర్లను సూచించారు. ఈ సమావేశంలో గైనకాల జిస్టు డాక్టర్ సుంకన్న, చిన్న పిల్లల వైద్యనిపుణుడు ఈర్లదిన్నె శ్రీధర్ పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్: ఎస్ఎఫ్ఐ


మాట్లాడుతున్న రమేష్ నాయక్

డోన్(రూరల్), జూలై 2: నీట్‌లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ గురువారం నిర్వహిస్తున్న దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు రమేష్ నాయక్, డోన్ అధ్యక్ష కార్యదర్శులు అశోక్, మహబూబ్ బాషా పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మా ట్లాడుతూ నీట్, నెట్ పేర్లతో విద్యారంగాన్ని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపిం చారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

● విద్యారంగ సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 4న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బంద్‌కు సహకరించాలన్నారు.

బేతంచెర్ల: ఈనెల 4న చేపట్టే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలను సర్వనాశనం చేసి నాణ్యత ప్రమాణాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, లీకులకు కారణమైన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐ ఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్, భాస్కర్, నాయకులు మనోహర్, ఇసాక్, మధుకృష్ణ, సాయి, వెంకట సుభాష్, రియాజ్ పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

దొర్నిపాడు, జూలై 2: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో వెలసిన నాగేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన ఆలయ భూములను మంగళవారం కార్యనిర్వాహణాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. నాగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 25.62 ఎకరాలు, చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన 26.46 ఎకరాలను వేలం వేయగా రూ.11.73 లక్షలు వేలం పాట పాడారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరామిరెడ్డి, దొర్నిపాడు మాజీ సొసైటీ అధ్యక్షుడు సిద్ధి సత్యం, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

చాగలమర్రి, జూలై 2: గ్రామాల్లో పండ్ల తోటల సాగుకు రైతులను ఉపాధి సిబ్బంది ప్రోత్సహించాలని ఏపీడీ సాంబశివుడు పేర్కొన్నారు. మంగళవారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 300 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం ఉందని అన్నారు. 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి పనుల రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని పెద్దబోదనం గ్రామ సమీపంలో ఫారంపండ్ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో నిర్మల, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, జూలై 2: మండలంలోని మల్లేవేముల, చాగలమర్రి గ్రామాల్లోని ప్రాథమిక, బాలుర ఉన్నత పాఠశాలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల మంగళవారం తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో కిట్లను పంపిణీ చేశారు. చాగలమర్రి పాత బస్టాండు ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో అనూరాధ తనిఖీ చేసి రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మల్లేవేముల ప్రాథమిక పాఠశాలను ఎంఈవో న్యామతుల్ల తనిఖీ చేశారు. విద్యార్థులకు కిట్లను అందజేశారు. హెచ్ఎంలు కోటయ్య, మౌళాలి, మాధురి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కొలిమిగుండ్ల రూరల్, జూలై 2: జనసేన, టీడీపీ యువ నాయకుల చొరవతో మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని శాంతినగర్ ఆసుపత్రి కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. మంగళవారం జనసేన మండల అధ్యక్షుడు గుజ్జల పెద్దయ్య, ప్రతాప్, రాజా, వెంకటరమణ శాంతి నగర్‌లో పర్యటిస్తుండగా కాలనీ వాసులు నీటి సరఫరా లేదంటూ వారి దృష్టికి తీసుకెళ్లారు.. దీంతో వారు ఎంపీడీవో సాయిక్రిష్ణ దృష్టికి సమస్యను తీసుకెళ్లండతో గ్రామ సర్పంచ్ శివరాముడు కాలనీలో పైప్‌లైన్‌కు మర మ్మతులు నిర్వహించారు. బోరు బావిలో నూతన పైప్ ఏర్పాటు చేసి తాగు నీటిని పునరుద్ధరించారు. దీంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పృథ్వీ, టీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేరుసోముల సర్పంచ్‌గా వల్లపురెడ్డి భాగ్యలక్ష్మి

సంజామల, జూలై 2: మండలంలోని పేరుసోముల గ్రామ సర్పంచ్‌గా వల్లపురెడ్డి భాగ్యలక్ష్మి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంత కాలం సర్పంచ్‌గా పనిచేసిన అందనం శృతి అనారోగ్య కారణాల వల్ల ఆమె సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టలేనని జిల్లా పంచాయతీ అధికారికి వైద్యుల ధ్రువీకరణ పత్రంతో సంప్రదించారు. దీంతో ఆమె స్థానంలో ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్న వల్లపురెడ్డి భాగ్యలక్ష్మిని సర్పంచ్‌గా నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు భాగ్యలక్ష్మి త్వరలో సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఘనంగా గంగమ్మకు బోనాలు

దొర్నిపాడు, జూలై 2: దొర్నిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవతకు రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల కార్యక్రమం నిర్వహించారు. గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ పురష్కరించుకొని 51 రోజున భక్తిశ్రద్ధలతో బోనాలను మహిళలు తలపై ఉంచుకొని గ్రామ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి గంగమ్మకు బోనాలు సమర్పించారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూలై 2 : మండలంలోని రుద్రవరం, కొండమాయపల్లె, యల్లావత్తుల, చినకంబలూరు గ్రామాలో మంగళవారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవార్లకు చీరలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీ సీనియర్ నాయకుడికి సన్మానం


పక్కీరారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల రూరల్, జూలై 2: టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డిని కొలిమిగుండ్ల మండలం పెద్దవెంతుర్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కలిసి సన్మానించారు. బనగానపల్లె నియోజకవర్గంలో బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపుతో పాటు, మంత్రి వర్గంలో స్థానం సంపాదించడం పట్ల వారు పక్కీరారెడ్డిని కలిసి అభినందించారు. కార్యక్రమంలో పెద్దవెంతుర్ల చెన్నారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

బనగానపల్లె, జూలై 2: గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని డోన్ డీఎల్‌పీవో బాలకృష్ణుడు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయాల కార్యదర్శులతో పారిశుధ్యంపై ప్రత్యేక రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో బాల కృష్ణుడు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు సిబ్బందితో శుభ్రం చేయించాలన్నారు. అవసరమైన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ప్యాపిలి, జూలై 2: కాకినాడలో ఈనెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రతాప్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో ఎస్టీయూ కార్యాలయం ఎదురుగా శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్లను సంఘం నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో శివకేశవులు, బాషా, చంద్రనాయక్, మధు, ప్రసాద్ పాల్గొన్నారు.

బాలికల విద్యను ప్రోత్సహించాలి

బనగానపల్లె, జూలై 2: నేటి సమాజంలో బాలికల విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. మంగళవారం పలుకూరు మజరా గ్రామం దేవనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాతపుస్తకాలు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం హుసేన్‌వలి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్య పరిష్కారం

కొలిమిగుండ్ల రూరల్, జూలై 2: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో మండలంలోని తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె, అబ్దులా పురం గ్రామాల విద్యార్థుల బస్సు సమస్యకు పరిష్కారం లభించింది. ఆయా గ్రామాల విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నాయకుడు ఇటిక్యాల బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మాయిపల్లె సర్పంచ్ ఆదినారా యణరెడ్డి, గోపాల్‌రెడ్డి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు కౌన్సెలింగ్

నంద్యాల, జూలై 2(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు పెట్టినట్లు ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివరామయ్య మంగళవారం చెప్పారు. కళాశాలలో బిఎస్సీ (మ్యాథ్స్, సైన్స్), బికాం, బిఏ కోర్సులకు సీట్లు ఉన్నాయని, విద్యార్థులు కళాశాలకు వచ్చి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

డెంగీ మాసోత్సవ ర్యాలీ

చాగలమర్రి, జూలై 2: చాగలమర్రి గ్రామంలో మంగళవారం ఆశా డే సందర్భంగా డెంగీ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు అంజలి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు కలిసి వీధుల గుండా అవగాహన ర్యాలీ చేశారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, అతిసార వ్యాధులపై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. హెచ్ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ధనుంజయుడు కుటుంబాన్ని ఆదుకుంటాం


సుశీలమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ

కోవెలకుంట్ల, జూలై 2: టీడీపీ నాయకుడు ధనుంజయుడు కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడులు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి భార్య బీసీ ఇందిరమ్మ అన్నారు. కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామంలో టీడీపీ నాయకుడు ధనుంజయుడు తల్లి సుశీలమ్మ (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీసీ ఇందిరమ్మ వెలగటూరు గ్రామానికి చేరుకుని సుశీలమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మనోహర్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తాం: బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె: మండలంలోని చెర్వుపల్లె గ్రామంలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. గ్రామంలో అధ్వానంగా ఉన్న మురుగు కాల్వలను ఆమె పరిశీలించారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. చెర్వుపల్లెలో ప్రజలు తాగునీరు లేక ఇబ్బంది పడుతుంటే తాము ట్యాంకర్‌ను పంపిస్తే గ్రామ వైసీపీ నాయకులు అడ్డుకున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హిందూ సమాజానికి రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి


నిరసన ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

బేతంచెర్ల, జూలై 2: పార్లమెంటు సమావేశాల్లో భారతీయ హిందూ సాంప్రదాయాలపై అవహేళనగా కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీ మాట్లాడటం హేయమైన చర్య అని, ఆయన హిందూ సమాజానికి ఆయన క్షమాపణ చెప్పాలని నంద్యాల జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి, భారతీయ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షుడు గౌరిహుశేన్ రెడ్డి, సురభీ గోశాల అధ్యక్షుడు మారుతి శర్మ అన్నారు. మంగళవారం సాయంత్రం విశ్వహిందూ పరిషత్ బీజేపీ హిందూ ఐక్యసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో వారు పాల్గొని ప్రసంగించారు.

మహిళల స్వయం ఉపాధికి రామ్‌కో చేయూత

కొలిమిగుండ్ల రూరల్, జూలై 2: మండలంలోని వివిధ గ్రామాల మహిళల ఉపాధి కోసం రామ్‌కో పరిశ్రమ తనవంతు చేయూత అందిస్తుందని యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు వెల్లడించారు. రామ్‌కో ఆధ్వర్యంలో మహిళల స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో బాగంగా వంట తయారీపై గత నెల రోజులుగా చేపట్టిన శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈసం దర్భంగా వంటలో శిక్షణ తీసుకున్న మహిళలకు రెడ్డి నాగరాజు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే కొలిమిగుండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి రూ.లక్ష విలువచేసే బీసీ అడాప్టర్లు, ఫర్నీచర్ తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ రామారాజు, జీఎం రవికుమార్, భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.